క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు

పలమనేరు: పట్టణంలోని శివాలయంలో హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. రూ.1.97లక్షలు హుండీ ఆదాయం వచ్చినట్టు ఎండోమెంట్ అధికారి కమలాకర్ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ టెంపుల్స్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, స్థానిక ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం



విరాళమిచ్చిన వారికి సత్కారం

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద ఉచిత అన్న ప్రసాదం నిర్వహణకు తిరుపతి జయనగర్ కాలనీ సర్పంచ్ ఎం.కోటేశ్వరరావు, మునిపుష్ప దంపతులు రూ.26,121లను విరాళంగా అందజేశారని ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి శుక్రవారం తెలిపారు. కోరిన కోర్కెలు ఫలించడంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి వారు మొక్కులు చెల్లించినట్లు తెలిపారు. విరాళమిచ్చిన వారిని ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న మండల సమాఖ్య సిబ్బంది

పులిచెర్ల(కల్లూరు): ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు పొందవచ్చని మండల సమాఖ్య సిబ్బంది చెప్పారు. శుక్రవారం మండలంలోని వెంకట దాసరపల్లెలో రైతులు వివిధ రకాల పంటల(మిక్సింగ్)ను ఒకేచోట సాగు చేయడం వలన తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి, అధిక లాభాలు పొందవచ్చన్నారు. రైతులు ఈ వ్యవసాయ పద్ధతులను పాటించాలని కోరారు. కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు సుశీల, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రమేష్, మునిచంద్ర, నాగరాజు, రెడ్డివాణి, శ్రీదేవి, లత తదితరులు పాల్గొన్నారు.

టమాట మండీ యజమానిపై కేసు

రామకుప్పం: రైతుల వద్ద టమాటాలు కొని డబ్బులు ఇవ్వకుండా మోసగించిన స్థానిక సీకేఆర్ మండీ యజమాని కేశవరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ముద్దనపల్లెకు చెందిన రైతు ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేశవరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

జూనియర్ లెక్చరర్ల బదిలీలు హర్షణీయం

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు జీరో సర్వీస్ బదిలీలు నిర్వహించడం హర్షణీయమని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆ సంఘం జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ





దొడ్డ డెయిరీ నుంచి మండిపేట కోటూరు మట్టితో గుంతలుగా ఉన్న దృశ్యం (ఫైల్), ఇప్పుడు తారు రోడ్డుతో ఇలా..

- నాడు అధ్వాన్నం.. నేడు అద్దంలా రహదారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణ ప్రాంత ప్రజలు

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని పలు గ్రామీణ ప్రాంతాలకు గతంలో కనీసం మట్టిరోడ్లు కూడా సక్రమంగా లేక ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. ఇక వర్షాకాలంలో అయితే ఈ దారుల్లో కనీసం నడచివెళ్లేందుకు వీలుకాని పరిస్థితి. ద్విచక్రవాహనాలు బురద మూలాన నియంత్రణ కోల్పోవడంతో మోటార్ సైక్లిస్టు కింద పడి గాయాల పాలయ్యేవారు. ఇదంతా గతం. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో గ్రామీణ రహదారుల రూపురేఖలు మారిపోయాయి. మట్టిరోడ్లను తారురోడ్లుగా వేయడంతో రాకపోకలు, రవాణా సౌకర్యం మెరుగుపడింది. నియోజకవర్గంలో బీటీ, సీసీ రోడ్లు 160 కిలోమీటర్ల మేర రూ.122 కోట్లతో పీఆర్, పీఆర్ పీఐయూ, ఆర్అండ్‌బీల ఆధ్వర్యంలో పనులు చేశారు. ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు ఆర్థికసాయంతో నియోజకవర్గంలో దాదాపు 80శాతం రోడ్లు వేశారు.

దొడ్ల డెయిరీ నుంచి మండిపేటకోటూరుకు..

పలమనేరు- కుప్పం రోడ్డులోంచి మొరం పంచాయతీ దొడ్ల డెయిరీ నుంచి మండిపేట కోటూరు వరకు 8.05 కిలోమీటర్ల మేర తారురోడ్డు వేశారు. పీఎం గ్రామీణ సడక్ యోజన పథకం కింద రూ.5.05కోట్ల అంచనాతో గ్రామీణాభివృద్ధి శాఖ సౌజన్యంతో పంచాయతీరాజ్‌శాఖ ఈ పనులను చేసింది. పనులు పూర్తయినా మరో ఐదేళ్లపాటు ఈ రహదారి నిర్వహణ కోసం రూ.35.96లక్షలు మంజూరు చేశారు. 2020 నవంబర్ 17న ప్రారంభమైన ఈ రోడ్డు పనులు 2021 నవంబర్ 16వ తేదీకి పూర్తయ్యాయి.

నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు పనులు

ఈ మార్గంలో 8.05కి.మీలలో 13 కల్వర్టులు నిర్మించారు. 1.2 కిమీ సీసీ రోడ్లను సైతం వేశారు. తొలుత 22,799 క్యూసెక్ మీటర్లతో మట్టిపని చేసి 9,120 ట్రాక్టర్ల నీటితో దీన్ని గట్టిపరిచారు. గ్రాన్యులర్ సబ్‌వే కోసం 3009 క్యూబిక్ మీటర్ల కంకర వాడారు. 516 ట్రాక్టర్ల స్టోన్‌డస్ట్‌ను వినియోగించారు. రెండోవరుస కంకరను 15 సెంటీమీటర్ల మందంతో దృఢంగా వేశారు.ఆపై 3718 క్యూబిక్ మీటర్ల తారు, 1594 ట్రాక్టర్ల స్టోన్‌డస్ట్‌ను వాడారు. దానిపై 23,360 కిలోల తారుతో ప్రైమ్ కోట్, 7,564 కేజీలతో టాక్‌కోట్ వేసి, ప్రీమిక్స్ కార్పెట్ 20 ఎంఎం మందంతో కిలోమీటర్‌కు 8,025 కేజీల తారును వినియోగించారు. తారురోడ్డు మధ్యలో అవసరమైన చోట 1.19 కిలోమీటర్ల సిమెంట్ రోడ్డును వేశారు. దీంతో రోడ్డు నిర్మాణం చాలా నాణ్యతతో ఉంటోంది.

ఎనిమిది గ్రామాలకు సౌకర్యంగా రోడ్డు

దొడ్ల డెయిరీ నుంచి గజ్జలవారిపల్లె, చెన్నుపల్లె, పకీరుపల్లె, కూర్మాయి, సముద్రపల్లె, ఎస్టీకాలనీ, మండిపేట, కోటూరు గ్రామాల ప్రజలకు కొత్త తారు రోడ్డు ఎంతో సౌకర్యంగా మారింది. దీంతోపాటు పలమనేరు నుంచి గడ్డూరు మీదుగా, టి.వడ్డూరు క్రాస్‌నుంచి సముద్రపల్లె మీదుగా, పెంగరగుంట క్రాస్‌నుంచి కోటూరుకు వెళ్లడం సులభమైంది. సముద్రపల్లె ప్రాంతం నుంచి కొలమాసనపల్లెకు పదికిలోమీటర్ల దూరం తగ్గింది.

ఐదేళ్లపాటు రోడ్డు నిర్వహణ కూడా...

తారురోడ్డు వేశాక ఐదేళ్ల వరకూ సంబంధిత కాంట్రాక్టరే రోడ్డు నిర్వహణ బాధ్యతను చూడల్సి ఉంది. రోడ్డుకిరువైపులా గడ్డిపొదల తొలగింపు, వర్షం కోతలు, మట్టిభుజాలు, గుంతలు, పగుళ్లు, కల్వర్టుల నిర్వహణను పర్యవేక్షించారు. రోడ్డుపక్కన క్రాస్ డ్రైనేజీలు, సూచిక పలకలు, పట్టిగోడలకు సున్నం వేయడం లాంటి పనులు చేయాలి.



గజ్జలవారిపల్లె రోడ్డు బురదమయంగా (ఫైల్)



రోడ్డు ఇప్పుడు ఇలా..

గ్రామాల అభివృద్ధికి రహదారులే సూచిక



ఏ గ్రామమైనా పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాలంటే తొలుత మంచి రహదారి సౌకర్యం ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. ఇప్పటికే పూర్తయిన రోడ్లను చూస్తుంటే ఆనందంగా ఉంది. ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యంగా మారింది. –మల్లిక, జెడ్పీటీసీ సభ్యురాలు, సముద్రపల్లె

రైతులకు చాలా మేలు



ఇంతకు ముందు వ్యవసాయోత్పత్తులను మార్కెట్‌కు తీసుకెళ్లడానికి ఇబ్బందిగా ఉండేది. మట్టి రోడ్డు చాలా అధ్వానంగా ఉండడంతో కనీసం బైక్‌లు వెళ్లలేని దుస్థితి. ఆటోలను బాడుగకు పిలిచినా వచ్చేవారు కాదు. ఇప్పుడు కొత్త తారురోడ్డు వేయడంతో చాలా సౌకర్యంగా ఉంది. రోడ్డుబాగుంది కాబట్టి ఏ వాహనమైనా వస్తోంది. దీంతో రైతులకు రవాణా సౌకర్యాలు మెరుగు పడ్డాయి. –అమరనాథరెడ్డి, చెన్నుపల్లె, పలమనేరు మండలం

అర్హులందరికీ సంక్షేమ లబ్ధి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి

చౌడేపల్లె: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో అర్హులందరూ లబ్ధి పొందేలా చూడాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, నవరత్నాలతోపాటు 35 రకాల వివిధ పథకాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. జనరంజక పాలన సాగిస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించేలా ప్రజాప్రతినిధులు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్, ఎంపీటీసీ శ్రీరాములు, ఎంపీడీఓ సుధాకర్, డీపీఎం మధుసూదన, ఏపీఎం నర్వోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ



చౌడేపల్లె: డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

చౌడేపల్లె: స్థానిక విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో శుక్రవారం యూటీఎఫ్ 2024 డైరీ, క్యాలెండర్లను ఎంఈఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ ఆవిష్కరించారు. రాబోయే నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయు ఆరోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. సమావేశంలో యూటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుప్పంలో..

కుప్పం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను శుక్రవారం తన కార్యాలయంలో ఎంఈఓ మహబూబ్‌బాషా యూటీఎఫ్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు.



కుప్పంలో..

కుష్ఠుపై అవగాహన



కుప్పనపల్లెలో అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ

బైరెడ్డిపల్లె: మండలంలోని పాతపేట, కుప్పనపల్లె గ్రామాల్లో శుక్రవారం బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ మాట్లాడుతూ, స్పర్శలేని మచ్చలు శరీరంపై ఉంటే సమీపంలోని వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. ప్రాథమిక దశలో కుష్ఠుగా నిర్ధారణ అయితే బహుళ ఔషధ చికిత్సతో ఆరోగ్యవంతులు కావచ్చన్నారు. కరోనా కేసులు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వ్యాపారవేత్త మృతి



ఆంజినారాయణ

సదుం: స్థానిక కన్యకాపరమేశ్వరి వీధికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ముల్లంగి ఆంజినారాయణ శెట్టి (94) వయోభారంతో శుక్రవారం మృతి చెందారు. పలు సేవా కార్యక్రమాలతో ఆయన గుర్తింపు పొందారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో సరస్వతీ విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు ఆలయాలు, చర్చి నిర్మాణానికి విరాళాలు ఇచ్చారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతి ఏటా ప్రోత్సాహక బహుమతులు ఇస్తున్నారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలు శనివారం నిర్వహిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

‘వై ఏపీ నీడ్స్ జగన్’ విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న కన్వీనర్ బాలాజీ నాయుడు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లెలో జనవరి 3న నిర్వహించనున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాలాజీనాయుడు కోరారు. శుక్రవారం పంచాయతీలోని వైఎస్సార్ సీపీ నాయకులతో కొలమాసనపల్లెలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ : మోటార్ సైక్లిస్టుకు తీవ్రగాయాలు

పెద్దపంజాణి: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మోటార్ సైక్లిస్టు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మండలంలోని చిన్నేపల్లె వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. బెరపల్లెకు చెందిన సుధాకర్‌రెడ్డి, తమ గ్రామస్తుడు జగదీష్‌తో కలసి సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో మండల కేంద్రానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో చిన్నేపల్లె సమీపంలో గుర్తుతెలియని వాహనం వారిని ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో సుధాకర్‌రెడ్డి తీవ్రంగాను, జగదీష్ స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది వారిని చికిత్స నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పెద్దపంజాణి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారి గర్భాలయాన్ని మామిడి, వేపాకు, పూలతోరణాలతో అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఉదయం 10.30 నుంచి 12 గంటల నడుమ రాహుకాల అభిషేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి పూజలు చేయించారు. అలాగే ఉపవాస దీక్షలతో మహిళలు అమ్మవారికి విశేష పూజలు చేయించి మొక్కులు చెల్లించారు. ఉభయదారులకు చైర్మన్ ప్రసాదాలను పంపిణీ చేశారు.





ప్రత్యేక అలంకరణలో గంగమ్మ, వైష్ణవి దేవి

భక్తిప్రపత్తులతో శాంతి హోమ పూజలు

మండలంలో పుదిపట్లలోని శ్రీ వైష్ణవిదేవి ఆలయంలో శుక్రవారం భక్తిప్రపత్తులతో శాంతి హోమ పూజలు నిర్వహించారు. అభయ ఆంజనేయ స్వామి, వైష్ణవిదేవి, నాగభైరవస్వామికి వేద పండితులు వేకువ జామున నుంచి గణపతి పూజ, హోమపూజలు, అర్చనలు, చండీ హోమ పూజలు శాస్త్రోక్తంగా చేశారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఈరోజు

వాహనాల వేలం

పుంగనూరు: మద్యం అక్రమ రవాణా కేసుల్లో సీజ్ చేసిన 10 ద్విచక్రవాహనాలను శనివారం ఉదయం 11 గంటలకు వేలం వేస్తామని సెబ్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు డిపాజిట్ చెల్లించి, వేలంలో పాల్గొనవచ్చన్నారు.

మున్సిపల్ బడ్జెట్ సమావేశం

పుంగనూరు: మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచనల మేరకు ఈ బడ్జెట్‌ను తయారు చేశామని, కౌన్సిల్ సభ్యుల ఆమోదం తరువాత బడ్జెట్ వివరాలు వెల్లడిస్తామన్నారు. ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం

పుంగనూరు: తమ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు తహసీల్దార్ సీతారామన్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పెన్షన్ల పంపిణీపై సమావేశం

చౌడేపల్లె: ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త పెన్షన్లు, పెంచిన పెన్షన్లు పంపిణీ కార్యక్రమాలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ శుక్రవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

ఆరోగ్యానికి క్రీడలు

పుంగనూరు: ఆరోగ్యవంతంగా ఉండేందుకు ప్రతిఒక్కరూ తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను చైర్మన్ అలీమ్‌బాషాతో కలసి పట్టణంలో ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అలాగే మండలంలోని మంగళంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, బోయకొండ ఆలయ డైరెక్టర్ రాజేష్, కౌన్సిలర్లు నరసింహులు, కాళిదాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు నవీన్ కుమార్‌రాజు, సలామత్, వరదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పోటీలు

సదుం: ఆడుదాం ఆంధ్రా పోటీలు మండలంలో జోరుగా నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం 11 సచివాలయాల పరిధిలో వివిధ పోటీలు నిర్వహించినట్టు ఆయన చెప్పారు. జోగివారిపల్లెలో కబడ్డీ పోటీలను సర్పంచ్ అనితకుమారి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు.

బ్యాడ్మింటన్ విజేత నగిరి దళితవాడ

రొంపిచెర్ల: పురుషులు, మహిళల విభాగం బ్యాడ్మింటన్ విజేతగా నగిరి దళితవాడ జట్లు సచివాలయ స్థాయిలో విజేతగా నిలిచాయని పీఈటీ రంగారెడ్డి తెలిపారు. శుక్రవారం బొమ్మయ్యగారిపల్లె సచివాలయ పరిధిలో పురుషుల జట్లు 4, మహిళలు జట్లు 2 పోటీ పడ్డాయని తెలిపారు. విజేత జట్లు మండల స్థాయి పోటీలలో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి హరిబాబు, మహిళ పోలీస్ రేష్మా, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ కిషోర్, డిజిటల్ అసిస్టెంట్ సద్దాం హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్, ఖో–ఖో పోటీలు

గంగవరం: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా శుక్రవారం దండపల్లె, గండ్రాజుపల్లె 1, 2, గంగవరం 1, 2, 3, కలగటూరు, కల్లుపల్లె, మామడుగు, పసుపత్తూరు, పత్తికొండ గ్రామ సచివాలయాల పరిధిలో వాలీబాల్ పోటీలు, తాళ్లపల్లెలో ఖో–ఖో పోటీలు నిర్వహించారు. పలుచోట్ల క్రికెట్, వాలీబాల్ పోటీలు ముగిశాయి. 4వ రోజు మొత్తం 34 మ్యాచ్‌లు పూర్తయినట్టు ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

పెద్దపంజాణి: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప అన్నారు. శుక్రవారం బట్టదొడ్డి సచివాలయ పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు గెలుపు–ఓటములు సమానంగా స్వీకరించాలన్నారు. అనంతరం క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ శంకరప్ప, ఎంపీటీసీ గురుమూర్తి, పీఎస్ పవన్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: మండలంలో 4వ రోజున నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రీడలలో క్రికెట్, వాలీబాల్, తదితర పోటీలు నిర్వహించారు. మండలంలోని యామగానిపల్లె , కనమనపల్లె, గుండ్లసాగరం, అగరం గ్రామాల యువకులకు ద్రవిడ వర్సిటీ ప్రాంగణంలో క్రీడలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ మాట్లాడారు. ఈఓపీఆర్డి శంకర్, సర్పంచులు నాగరాజు, భాస్కర్, కార్యదర్శులు శివశంకర్, చంద్రప్ప పాల్గొన్నారు.



పుంగనూరు: మంగళం పంచాయతీలో క్రీడాకారులతో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, రాజారెడ్డి



పుంగనూరు: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్



సదుం: జోగివారిపల్లెలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న నేతలు



రొంపిచెర్ల: బొమ్మయ్యగారిపల్లెలో బ్యాడ్మింటన్ పోటీలు



గంగవరం హైస్కూల్‌లో..



పెద్దపంజాణి: క్రికెట్ బ్యాట్లు అందజేస్తున్న ఎంపీపీ రెడ్డెప్ప



గుడుపల్లె : మాట్లాడుతున్న ఎంపీడీఓ తాజ్‌మస్రూర్